క్లుప్తంగా

మురుగు కాలువకు మరమ్మతులు

ఎట్టకేలకు స్పందించిన వీఎంసీ అధికారులు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగర పాలక సంస్థ ఎట్టకేలకు అధికారులు స్పందించారు. మధురానగర్ వంతెన మలుపులో ప్రమాదకరంగా ఉన్న మురుగుకాలువ వద్ద వీఎంసీ అధికారులు కాంక్రీట్‌తో శ్లాబ్ వేసి రాకపోకలకు వీలుగా సరిచేశారు. సర్వీసు రోడ్డులోని మురుగుకాలువపై ఇటీవల సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. దిమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి ఈ నెల 17వ తేదీ శనివారం 'తూతూ మంత్రంగా సిమెంట్ దిమ్మలు ఏర్పాటు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సిమెంట్ దిమ్మలు సరిచేయించారు. అయితే మలుపు ప్రాంతంలోని మురుగుకాలువపై దిమ్మలు వేయటం సరికాదని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున మురుగుకాలువపై శ్లాబ్ వేస్తామని అధికారులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం మురుగుకాలువపై శ్లాబ్ వేసి పనులు పూర్తిచేశారు.

బాండీ స్కేటింగ్‌లో క్రీడాకారుల సత్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ): బాండీ (ఐస్ బాల్ హాకీ) పోటీలో విజయవాడ భవానీపురానికి చెందిన బిగ్ చాంపియన్ స్కేటింగ్ అకాడమీ స్కేటింగ్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 10 మెడల్స్ సాధించారు. ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలో 9 రాష్ట్రాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 20 మెడల్స్ రాగా.. వాటిల్లో భవానీపురం బిగ్ చాంపియన్ స్కేటింగ్ అకాడమీ నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో కుందనిక బొల్లు, వేద శ్రీ, సునైన, దాక్షిణ్య, ఆఫ్రిన్ (అండర్ 10) సిల్వర్ మెడల్స్ సాధించారు. అదే విధంగా పర్ణం కష్వీ, శ్రీవల్లి, అభిజ్ఞ, దైత్య, శరణ్య (అండర్ 12) బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు అకాడమీ కోచ్ ఖాదర్ బాషా ఓ ప్రకటనలో వివరించారు. రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో10 మెడల్స్ సాధించటం అకాడమీకి గర్వకారణమని ఆయన అన్నారు.

'ఒక దేశం ఒకే ఎన్నిక'పై అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) కేంద్ర కార్యాలయంలో బుధవారం 'ఒక దేశం ఒకే ఎన్నిక' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం యువతను ఎంతగానో ఆలోచింపజేసిందని విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 57 ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాలతో పాటు విజయవాడ ప్రాంతీయ కేంద్రాలయంలోనూ ప్రత్యేక అభ్యాస మాధ్యమాల ద్వారా సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణ వికాస రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుందని శర్మ తెలిపారు. లోక్‌సభ, విధాన సభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ ఎంతో లాభదాయకమని మంత్రి వివరించారన్నారు. కార్యక్రమంలో ఇగ్నో ప్రాంతీయ కేంద్రాల నుంచి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె. సుమలత, డాక్టర్ పి. శరత్‌చంద్ర, డెప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ బాలచందర్ ఇతర అధికారులు సిబ్బందితో పాటు స్థానిక ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు

పటమట(విజయవాడతూర్పు): వ్యాపార సముదాయాల్లో పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, తమ, తమతోటి వారి ప్రాణాలను ఎలా కాపాడాలనే అంశాలపై అవగాహన ఉండాలిన రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం వీఎంసీ ఫైర్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని లక్కీ షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలనే అంశంపై షోరూంలో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు.

సమస్యల వలయంలో చేపల మార్కెట్!

- వసతులు కరువై వ్యాపారుల అవస్థలు
- అసౌకర్యానికి గురవుతున్న వైనం
- వర్షాలు కురిస్తే మరిన్ని సమస్యలు
- పట్టించుకోని వీఎంసీ

పాయకాపురం(విజయవాడరూరల్): పేరు గొప్ప ఊరు దిబ్బ సామెత చందాన ఉంది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రకాష్‌నగర్లోని మోడరన్ చేపల మార్కెట్. ఈ మార్కెట్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. మార్కెట్లో మొత్తం 22 షాపులున్నాయి. వీటిలో 10కిపైగా షాపుల్లో కనీస సదుపాయాలు లేక వ్యాపారులు రోడ్ల మీద పెట్టుకొని చేపలు అమ్ముకుంటున్నారు. మార్కెట్ భవనం శ్లాబు పెచ్చులూడి పడిపోతుంది. ఫ్లోరింగ్ పాడైపోయి గుంతలు పడి ఉంది. చీకటి పడితే దీపాలు సరిగ్గా వెలగక అంధకారం నెలకొంటుంది. నిత్యం పరిసరాల శుభ్రత అంటూ ప్రచారం చేసే వీఎంసీ చేపల మార్కెట్‌లో టాయిలెట్స్ సదుపాయం సరిగ్గా లేక వ్యాపారం చేసే మహిళలు అవస్థలు పడుతున్నారు. ఇన్ని సమస్యలతో సతమవుతున్న ఈ మోడరన్ చేపల మార్కెట్‌కు కనీసం మరమ్మతులు కూడా వీఎంసీ చేయించలేకపోతుంది. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మూడు నెలల క్రితం అధికారులతో కలిసి చేపల మార్కెట్ పరిశీలించారు. ఆ సందర్భంలో వ్యాపారం చేసుకొనే వారు మార్కెట్లో షాపులకు కరెంటు లేదని, శ్లాబు పెచ్చులూడి పడిపోవడంతో భయపడుతూ రోడ్డు పైన చేపలను అమ్ముకొంటున్నామని చెప్పారు. ఫ్లోరింగ్ పాడైపోయిందని వాటిని కూడా రిపేరు చేయించాలని కోరారు. సమీపంలోని డ్రెయినేజీ పంపు హౌస్ నుంచి దుర్వాసన వస్తోందని, టాయిలెట్స్ బాగుచేయాలని విన్నవించారు. ఆ సమస్యలను తెలుసుకోవడమే కాకుండా స్వయంగా పరిశీలించిన కమిషనర్ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



రోడ్డుపైన విక్రయాలు



ప్రకాష్‌నగర్లో మోడరన్ సూపర్‌మార్కెట్



సిమెంటు పెచ్చులూడి కనబడుతున్న భవనం

రూ.18 లక్షలతో అంచనాలు....

మోడరన్ చేపల మార్కెట్లో ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, కుళాయి కనెక్షన్లు, సెక్షనింగ్, శ్లాబు ప్లాస్టింగ్, పెయింటింగ్స్, కిటికీలు, గుమ్మాలు ఏర్పాటు, చేపలను శుభ్రం చేసుకొనే సదుపాయం లాంటివి మొత్తం రిపేర్లకు గాను రూ.18 లక్షలతో ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క పని కూడా చేపట్టలేదు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో శ్లాబు పెచ్చులూడి ఎప్పుడు పడిపోతోందనని బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. రోడ్డు మీదే విక్రయాలు చేపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. చేపలు, రొయ్యలు కొనుగోలు చేసే వారు రోడ్డు మీదే వాహనాలను పార్కు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. కష్టమర్లతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఓపెన్ అవుట్‌పాల్ డ్రెయిన్ రోడ్డుతో సమాన ఎత్తులో ఉండటం వలన భయపడుతున్నారు. డ్రెయిన్‌పైన ఐరన్ మెష్ లాంటివి ఏర్పాటు చేసి, అవసరమైనప్పుడు ఓపెన్‌చేసి క్లీన్ చేయడం, తర్వాత క్లోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వీఎంసీ సాధ్యమైనంత త్వరగా చేపల మార్కెట్‌కు మరమ్మతులు చేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డు పైన వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. చేపలమార్కెట్ లోపల వ్యాపారాలు జరిగితే ప్రమాదాలకు తావుండదు. అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఆ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– శివసత్యనారాయణ, ప్రకాష్‌నగర్

వారంలోగా పనులు ప్రారంభిస్తాం



ప్రకాష్‌నగర్ చేపల మార్కెట్ మరమ్మతులకు వీఎంసి రూ.18 లక్షలతో టెండర్లు పిలవడం జరిగింది. వారంలోగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, వీఎంసీ

ఆర్టీసీ బస్సు ఢీకొని తాత, మనువడికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్టీసీ బస్సు ఢీకొని తాత, మనువడికి గాయాలైన ఘటన మార్కెట్ యార్డ్ సమీపంలోని వెంకటేశ్వర ఫౌండ్రీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... గొల్లపూడి మౌలానగర్‌కు చెందిన తటవర్తి వెంకటకృష్ణారావు తన మనువడు పెరుమాళ్ల గుణదీప్‌ను చెస్ క్లాస్ నుంచి బైక్‌పై ఎక్కించుకొన్ని ఇంటికి తీసుకెళ్తున్నాడు. గొల్లపూడి మార్కెట్ రోడ్డులోని వెంకటేశ్వర ఫౌండ్రీ వద్ద రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తాత వెంకట కృష్ణారావు, మనువడు గుణదీప్ ఇద్దరూ బైక్ పై నుంచి పడిపోయారు. ఈ ఘటనలో వెంకట కృష్ణారావుకు తలకు బలమైన గాయమైంది. గుణదీప్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరిని గొల్లపూడిలోని ఆంధ్ర హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. మెరుగైన వైద్యం కోసం వీరిని ఓల్డ్ ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. వెంకట కృష్ణారావు ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నారు. ఈ ఘటనపై ఆయన కుమారుడు తటపర్తి నారాయణ వెంకటేష్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

దుర్గగుడి ఈవో శీనానాయక్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చేతి సంచులను వినియోగంలోకి తీసుకురావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, రావిచెట్టు వద్ద పూజ సామగ్రిని ఆయన పరిశీలించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో పెద్ద సంఖ్యలో ఖాళీ వాటర్ బాటిల్స్ ఉండటాన్ని గమనించి.. శానిటేషన్ సిబ్బంది క్యూలైన్లను శుభ్రం చేసే తరుణంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తొలగించాలని సూచించారు. అదే విధంగా అమ్మవారికి సమర్పించే పూజా సామగ్రిని సైతం భక్తులు ప్లాస్టిక్ కవర్లలో తీసుకువస్తున్నారని, కొండ దిగువన పూజా సామగ్రి విక్రయించే వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండపై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు భక్తులు, వ్యాపారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. దేవస్థానంలో తడిచెత్త, పొడి చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని గమనించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేవస్థానం భక్తులకు విక్రయిస్తున్న దర్శన టికెట్లను పరిశీలించారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి



వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మల్లాది విష్ణు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తుందని పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ తాము అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. సూరాబత్తుల దుర్గారావు ఆధ్వర్యంలో 57వ డివిజన్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ చేరారు. పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేదలు, బడుగు బలహీన వర్గాల పార్టీ అని చెప్పారు. వైఎస్సార్ సీపీతోనే పేదల సమస్యలు పరిష్కారం అవుతాయనే విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసి చూపించారని గుర్తు చేశారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా పేదలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడు తోడునీడగా ఉంటుందని తెలిపారు. ఇంత మంది స్వచ్ఛందంగా చేరటం పార్టీ పనితీరును తెలియచేస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సామన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. సూరాబత్తుల దుర్గారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని తాము బలంగా నమ్ముతున్నామన్నారు. అందుకే స్వచ్ఛందంగా 50 మందితో కలిసి పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజు, వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి పఠాన్ నజీర్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు ఆళ్ళ ఆదినారాయణ, సీనియర్ నాయకులు చెన్నకేశవరెడ్డి, బాల, ప్రేమ్ వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ప్రజా చైతన్య వేదికలు



మాట్లాడుతున్న ఇంతియాజ్, వేదికపై గోళ్ళ నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: గ్రంథాలయాలు ప్రజా చైతన్యవేదికలు అని విశ్రాంత అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, స్వేచ్ఛాంధ్ర ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో 10 రోజులపాటు బాల బాలికలకు నిర్వహించే శిక్షణ శిబిరం రెండో రోజుకు చేరుకుంది, బుధవారం నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ యువతీ యువకుల కెరీర్‌కు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. నాటి స్వాతంత్ర్య పోరాట సమయంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని చెప్పారు. బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది గ్రంథాలయాల నిర్వహణ అంశంగా జరిగిన సదస్సులో పాల్గొన్నారు. బాల బాలికలకు కథలు రాయడం ఎలా, వ్యక్తిత్వ వికాసానికి ఏయే పుస్తకాలు చదవాలి, చిత్రలేఖనం అంశాలపై శిక్షణ నిచ్చారు. గ్రంథాలయ ఉద్యమనేతలు గోళ్ళ నారాయణరావు, లక్ష్మయ్య, రెహ్మానుద్దీన్, ప్రసాద్, హసీనా పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా సెల్ఫ్ గ్రూమింగ్ (బ్యూటీషియన్ కోర్సు)లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. అందం అనేది కేవలం బాహ్య రూపానికి సంబంధించిన అంశం కాదని ఆత్మ విశ్వాసం, మనోభావాలు, సామాజిక సంబంధాలను కూడా అందం ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. మహిళలు అందంగా ఎలా తయారు కావాలనే విషయాలపై సెల్ఫ్ గ్రూమింగ్ కోర్సును నిర్వహిస్తున్నామని, నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

అధికార భాషను అమలు చేయాలి

టీఓఎల్ఐసీ చైర్మన్ సీవీఎస్ భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సీవీఎస్ భాస్కరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకులు, బీమా కార్యాలయాల రోజువారీ కార్యకలాపాల్లో అధికారిక భాషను అమలు చేయాలని, ఇందుకు సులభమైన మార్గాలు అనుసరించాలని టీఓఎల్ ఐసీ (బ్యాంక్ – ఇన్సూరెన్స్) చైర్మన్ సీవీఎస్ భాస్కర్‌రావు సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీసులో ది టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (బ్యాంకులు – ఇన్సూరెన్స్) అర్ధ వార్షిక సమావేశం బుధవారం నిర్వహించారు. టీఓఎల్ఐసీ (బ్యాంక్ – ఇన్సూరెన్స్) చైర్మన్ సీవీఎస్ భాస్కర్‌రావు అధ్యక్షత వహించిన సమావేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల కార్యాలయ అధిపతులు, వారి అధికారిక భాషా అధికారులు పాల్గొన్నారు. వివిధ బ్యాంకులు, బీమా కంపెనీలలో అధికార భాష అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీఓ ఎల్ఐసీ కన్వీనర్‌గా వ్యవహరిస్తోందని చెప్పారు. ఈ కమిటీలో 15 బ్యాంకులు, 5 ఇన్సూరెన్స్ కార్యాలయాలు ఉంటాయని తెలిపారు. జాతీయ స్థాయి బహుమతిని పొందేలా అధికారిక భాష కోసం మరింత సహకారం అందించాలని కోరారు. గత 6 నెలల్లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. టీఓఎల్ఐసి రాజభాష షీల్డ్ పోటీ బహుమతులు విజేతలకు అందజేశారు. ఈ సమావేశంలో టీఓఎల్ఐసీ సభ్య కార్యదర్శి, అధికారిక భాషా అధికారి పి. వివేకాసుధ, డెప్యూటీ డైరెక్టర్ (ఇంప్లిమెంటేషన్) అనిర్బన్ కుమార్ బిశ్వాస్, తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి దేవాలయాలు ముస్తాబు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరి



ప్రత్యేక అలంకరణలో మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో గురువారం నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యాన పూర్తి చేశారు. ఇప్పటికే దేవాలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరు లోకేశ్వరి తెలిపారు. ఇప్పటికే ఆలయంకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన క్యూలైన్‌లు, షామియానాలు, పందిళ్ళు ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీ విష్వక్సేన పూజతో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆలయ అర్చకులు సుబ్బయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామివారికి విశేషంగా నాగవల్లీదళాలతో అర్చనలు, పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం స్వామివారికి విశేషంగా పంచామృతస్నపన, నాగవల్లీదళ సహస్ర నామార్చన, శనివారం సిందూర అర్చన, 26వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి ఒంటె వాహనంపై ఊరేగింపు మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ జరుగుతుందని తెలిపారు. భక్తులు హనుమజ్జయంతి వేడుకలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.



దాసాంజనేయస్వామి

ముత్యాలంపాడులో....

ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎన్ రాజు తెలిపారు. గురువారం స్వామివారికి విశేషంగా తమలపాకులతో అర్చనలు పూజలు జరుగుతాయన్నారు.


శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురవారం హనుమజ్జయంతి వేడుకలను శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు. స్వామివారికి విశేషంగా సిందూరం, ఆకుపూజలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

మారుతీ వ్యాయామ శాలలో....

మారుతీ వ్యాయామశాలలో శ్రీ అభయాంజనేయస్వామివారి దేవాలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహించనున్నట్లు ఎస్. హనుమంతు ప్రసాద్ తెలిపారు. ఇక్కడ 20వ తేదీ నుంచి మొదలై 23వ తేదీ వరకు మూడు రోజల పాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలతో పాటు ప్రతి రోజూ హరికథాగానం ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం మడమల రాంబాబు భగవతార్ సుగ్రీవ మైత్రిపై హరికథ గానం చేశారు. ఆద్యంతం సుగ్రీవ మైత్రి గురించిన విశేషాలను వీనులవిందుగా వివరించారు.

• దంచికొట్టింది





ఎండాకాలంలో వానలు దంచికొడుతున్నాయి. విపరీతమైన ఉక్కపోత, వేడిమితో ఇబ్బందులు పడే సమయంలో కరిమబ్బుల పుణ్యమాని ఆహ్లాదకరం వాతావరణం నెలకొంటోంది. రెండు, మూడు రోజులుగా నగరాన్ని వరుణుడు వీడటం లేదు. రోజులో ఏదో ఒక సమయంలో వచ్చిన పలుకరించి పోతున్నాడు. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ.. వర్షం పడలేదు. అయితే సాయంత్రానికి కారు మబ్బులు కమ్మేసి, రాత్రి ఎనిమిది గంటల సమయంలో జోరు వాన కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

హెచ్ఐవీపై జానపద కళాజాత



కృష్ణలంక(విజయవాడ తూర్పు): స్థానిక రాణిగారితోటలోని వైట్‌హౌస్ సెంటర్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై జానపద కళాజాత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటిక కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్లు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, బ్లడ్ బ్యాంక్‌లు అందించే సేవలు, రక్తదానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూపీహెచ్‌సీ డాక్టర్ బి.సందీప్, ఆర్‌వీపీ గోవర్ధన్, గైడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.